క్లుప్తంగా

నేటి నుంచి నృత్యోత్సవం



నయీంనగర్: శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక విభాగం సహకారంతో వరంగల్‌లో కాకతీయ మ్యూజిక్ అకాడమీ, బజ్జూరి ఆర్గనైజేషన్, కృష్ణా సొసైటీ సంయుక్తంగా ఈనెల 15, 16వ తేదీల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి సాహిత్య, సంగీత, నృత్యోత్సవం కార్యక్రమాన్ని వరంగల్‌లోని రాధాకృష్ణ గార్డెన్‌లో నిర్వహించనున్నట్లు కాకతీయ మ్యూజిక్ అకాడమీ అధ్యక్షుడు తిరుపతయ్య తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీమన్నారాయణ, లక్ష్మీనారాయణ, నాగేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

17న తెలంగాణ జానపద సంబురాల జాతర



హన్మకొండ కల్చరల్: తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో జేబీ కల్చరల్ ఆర్ట్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రపంచ జానపద దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ జానపద ఆటపాటల సంబురాల జాతర -2025 కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. వరంగల్ శంకర్, దీకొండ సారంగపాణి యాదిలో ఈ నెల 17న హనుమకొండలో పబ్లిక్ గార్డెన్‌లోని పద్మశ్రీ నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో జరగనున్న కార్యక్రమ వాల్ పోస్టర్లను హనుమకొండ రాంనగర్‌లోని తన నివాసంలో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జానపద సీనియర్ కళాకారులు కళా శ్రీనివాస్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆకుకూర తోటల పరిశీలన



ఖిలా వరంగల్: ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా మధ్యకోటలో ఆకుకూర తోటలు, పొలాలు వరద ముంపునకు గురయ్యాయి. ఈ మేరకు పంట పొలాలు, ఆకుకూరల తోటలను వరంగల్ ఉద్యానశాఖ అధికారి ఎస్.తిరుపతి క్షేత్రస్థాయిలో గురువారం పరిశీలించారు. భారీ వర్షాల కారణంగా ఆకుకూరల్లో ప్రబలే తెగుళ్లు, యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. రైతులు జాగ్రత్తలు పాటించాలన్నారు.

ముంపు బాధితులకు వసతులు కల్పించాలి



న్యూశాయంపేట: భారీ వర్షాల కారణంగా ముంపునకు గురైన ప్రాంతాల బాధితులకు కనీస వసతులు కల్పించాలని, ఇళ్లు కోల్పోయిన వారిని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం కాశిబుగ్గ ఏరియా కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు 14వ డివిజన్ సుందరయ్య నగర్, బాలాజీ నగర్, మణికంఠ కాలనీ, ఎస్ఆర్ నగర్ ప్రాంతాల్లో గురువారం పర్యటించి సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి మహ్మద్ బషీర్ అహ్మద్, నాయకులు సాంబమూర్తి, కోమళ్ల రాజు, సుల్తాన్, ప్రేమ్‌రాజ్, ఇబ్రహీం, సందాని, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

బాటసారులకు రాగి జావా పంపిణీ



కాజీపేట: కాజీపేట పట్టణంలో కుశాల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాటసారులతో పాటు ప్రయాణికులకు గురువారం రాగి జావాను పంపిణీ చేశారు. ఖర్చుల కోసం తన తల్లిదండ్రులు ఇచ్చిన ప్యాకెట్ మనీతో బాటసారులకు రాగి జావాను అందిస్తున్నట్లు కుశల్ తెలిపారు. కార్యక్రమంలో అక్షయ్, కుశాల్, సంజయ్ పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పించాలి

మడికొండ: 46వ డివిజన్ అయోధ్యపురంలోని టీఎన్జీవోస్ -2కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని స్థానికులు కోరారు. ఈ మేరకు సుబేదారిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజుకు గురువారం వినతి పత్రం అందజేశారు. కాలనీలో వీధి దీపాలు, మిషన్ భగీరథ పైపులైన్స్‌పై ఎమ్మెల్యేతో చర్చించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు లింగాల సూరిబాబు, మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, కాలనీవాసులు, మెట్టుగుట్ట మాజీ చైర్మన్ రఘుచందర్, నాయకుడు బైరి లింగమూర్తి, కాలనీ కమిటీ ఉపాధ్యక్షుడు కాశగోని శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ శోభన్, కోశాధికారి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

వీడిన వరద.. వదలని బురద



డాక్టర్ రవీందర్ లేన్‌లో బురద



చెత్తను తొలగిస్తున్న కార్మికుడు



విద్యుత్ వైర్లను పునరుద్ధరిస్తూ..

- రోడ్లపై పేరుకుపోయిన చెత్తాచెదారం, వ్యర్థాలు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులు

ఖిలా వరంగల్: మంగళవారం కురిసిన భారీ వర్షానికి వరంగల్ రైల్వేగేట్ ప్రాంతం జలమయమైన విషయం తెలిసిందే. ప్రధానంగా 32, 33, 34, 35, 40, 41వ డివిజన్లలోని శాంతినగర్, సాకరాసికుంట, మైసయ్యనగర్, శివనగర్, కాశికుంట, లక్ష్మీనగర్, విశ్వనాథ కాలనీ, నాగేంద్రనగర్, ఎస్ఆర్ఆర్ తోట, గిరిప్రసాద్, లెనిన్‌నగర్ తదితర కాలనీలు పూర్తిగా నీటమునిగాయి. శివనగర్‌లోని సబ్‌స్టేషన్‌ను వరద ముంచెత్తగా విద్యుత్ సరఫరా నిలిచి ప్రజలు రోజంతా అంధకారంలో ఉండిపోయారు. డ్రెయినేజీలు పొంగిపొర్లగా వరదనీటితో కలిసి మురుగునీరు ఇళ్లల్లోకి చేరింది. బుధ, గురువారాల్లో వర్షం తగ్గుముఖం పట్టడంతో రోడ్లపై బురద పేరుకుపోయింది. డ్రెయినేజీల్లో చెత్తాచెదారం, వ్యర్థాలు నిలిచిపోయాయి. గురువారం మధ్యాహ్నం ఆయా డివిజన్ల కార్పొరేటర్లు పలు కాలనీల్లో పర్యటించి పునరుద్ధరణ పనులను పరిశీలించారు.

ప్రతీ దివ్యాంగుడికి డబుల్‌బెడ్రూం



ఇళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

న్యూశాయంపేట: అర్హులైన దివ్యాంగ అర్హులకు డబుల్ బెడ్రూం ఇల్లు కేటాయించడానికి కృషి చేస్తానని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. నగర పరిధిలోని 3వ డివిజన్ పైడిపల్లి శివారులో నిర్మాణంలో ఉన్న 70 డబుల్ బెడ్రూం ఇళ్ల భవన సముదాయాలను క్షేత్రస్థాయిలో గురువారం పరిశీలించారు. పనులు వేగవంతం చేసి పంపిణీకి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అంతర్గత రోడ్లు పనులను పరిశీలించి ప్రాంగణంలో పలు రకాల మొక్కలు నాటేందుకు పలు సూచనలు చేశారు. ఈ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి, స్థానిక కార్పొరేటర్ జన్ను షీబారాణి, అనిల్‌కుమార్, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కేఎంసీ కార్మికుల సమ్మె



మాట్లాడుతున్న రాగుల రమేష్

హన్మకొండ: వైద్య కళాశాల అధికారుల నిర్లక్ష్యం ఫలితంగానే మూడు రోజులుగా కార్మికులు సమ్మె బాట పట్టారని, దీనికి జిల్లా అధికార యంత్రాంగం, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ బాధ్యత వహించాలని సీఐటీయూ హనుమకొండ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ డిమాండ్ చేశారు. గత మూడు రోజులుగా విధులు బహిష్కరించి సమ్మె చేస్తున్న కాకతీయ మెడికల్ కళాశాలలోని మెన్స్, ఉమెన్స్ హాస్టళ్లలో పనిచేస్తున్న 86 మంది కార్మికులు గురువారం హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలకు రాగుల రమేష్ సంఘీభావం తెలిపి మాట్లాడుతూ 8 నెలలుగా కార్మికులతో వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారని వాపోయారు. కార్యక్రమంలో తెలంగాణ యునైటెడ్ మెడికల్ హెల్త్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.యాదా నాయక్, సీఐటీయూ మెడికల్ కళాశాల యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

సంస్కృతికి మారుపేరు 'వరంగల్'



తీజ్ ఉత్సవాల్లో సీతారాం నాయక్, తదితరులు

హన్మకొండ: బంజారా సంస్కృతీ సంప్రదాయాలకు మారుపేరు వరంగల్ మహానగర బంజారాలు అని మాజీ ఎంపీ ప్రొఫెసర్ అజ్మీర సీతారాం నాయక్ అన్నారు. గిరిజన భవన్‌లో నిర్వహిస్తున్న తీజ్ ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు గురువారం సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు వివిధ జిల్లాల నుంచి గ్రేటర్ వరంగల్‌లో నివాసముంటున్న బంజారాలు గిరిజన భవన్ వేదికగా తీజ్ ఉత్సవాలు జరుపుకోవడం సంతోషకరమని సీతారాం నాయక్ అన్నారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి అడిషనల్ ఎస్పీ ఆంగోతు నరేష్ కుమార్, కొడకండ్ల మాజీ జెడ్పీటీసీ కేలోతు సత్యమ్మ, కార్యక్రమ నిర్వాహకులు ఆంగోత్ వినోద్ లోక్ నాయక్, డాక్టర్ గుగులోతు రాజు నాయక్, భూక్య హేమా నాయక్, లకావత్ రవీందర్ నాయక్, మాలోతు నాను నాయక్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఆందోళన



సమావేశంలో మాట్లాడుతున్న చుక్కయ్య

కాజీపేట: నూతనంగా ఏర్పడిన మండలంలో నానాటికి పెరిగిపోతున్న సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 21న మున్సిపల్ సర్కిల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేయడానికి కార్యకర్తలు సన్నద్ధం కావాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎం.చుక్కయ్య పిలుపునిచ్చారు. కాజీపేట మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో విలీన గ్రామాల పరిస్థితి నానాటికి దయనీయంగా మారుతున్న విషయాన్ని పాలకులు గుర్తించపోవడం బాధాకరమని వాపోయారు. మున్సిపల్ అధికారులు అనుసరిస్తున్న మొండి వైఖరిపై సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. సమావేశంలో కారు ఉపేందర్, మండల కార్యదర్శి ఓరుగంటి సాంబయ్య, జంపాల రమేష్, రామంచ సారంగపాణి, జంపాల మురళి, దార్ల ప్రభాకర్, పెండ్యాల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య భారతంలో రైల్వే పురోగతి



చిన్నారులతో సూర్యనారాయణ, పూజిత

కాజీపేట రూరల్: స్వాతంత్ర్య భారతంలో భారతీయ రైల్వే నాటి స్టీమ్ ఇంజన్ నుంచి నేటి వందే భారత్, హైడ్రాలిక్ టు బుల్లెట్ ట్రైన్ల వరకు సాంకేతిక విప్లవ రంగంలో ఎంతో పురోగతి సాధించి సేవలందిస్తోందని రైల్వే ఎలక్ట్రిక్‌షెడ్ సీనియర్ డీఈఈ ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ జి.సూర్యనారాయణ తెలిపారు. స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా చిన్నారులకు ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విజేతలకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని కాజీపేట రైల్వే కమ్యూనిటీ హాల్‌లో గురువారం రాత్రి నిర్వహించారు. కార్యక్రమంలో రైల్వే ఉమెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నుంచి జి.పూజిత, రైల్వే ఇన్‌స్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్, జాయింట్ సెక్రటరీ ఎం.రాజయ్య, కోశాధికారి గిరిమిట్ల రాజేశ్వర్, కల్చరల్ ఇన్‌చార్జ్ దారవత్ రఘు, కమిటీ సభ్యులు ఎస్.నవీన్, పి.ప్రశాంత్, రవికిరణ్, సుంచు ప్రశాంత్, క్రీడల ఇన్‌చార్జ్‌లు సుధాకర్‌రావు, సాయిరాజ్, జి.భాస్కర్, మల్లయ్య, శ్రీను, మహేష్, సదానందం పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న కళాజాత కళాకారులు

రామన్నపేట: డ్రగ్, గంజాయికి యువత దూరంగా ఉంటూ ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని మట్టెవాడ ఎస్సైలు రాజేందర్, శివకృష్ణ సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు నగరంలోని ఎల్‌బీ కళాశాలలో విద్యార్థులకు పోలీస్ కళా బృందం ద్వారా గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్, గుట్కా, ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్స్‌కు దూరంగా ఉండాలని చెప్పారు. ఈవ్‌టీజింగ్, హ్యూమన్ ట్రాఫికింగ్ వంటి వాటిని గుర్తిస్తే వెంటనే తల్లిదండ్రులకు లేదా పోలీసులకు, డయల్ 100 సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అరుణ, వైస్ ప్రిన్సిపాల్ రాజేందర్‌రెడ్డి, ఎన్‌సీసీ కోఆర్డినేటర్ సదానందం, అధ్యాపకులు, పోలీస్, బృందం సభ్యులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్లలో విస్తృత తనిఖీలు



వరంగల్‌లో తనిఖీలు చేస్తున్న అధికారులు



కాజీపేట జంక్షన్‌లో..

ఖిలా వరంగల్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వరంగల్ రైల్వేస్టేషన్‌లో ఆర్పీఎఫ్, జీఆర్పీ ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వర్లు గౌడ్, పీ.సురేందర్ ఆధ్వర్యంలో గురువారం తనిఖీలు నిర్వహించారు. ప్లాట్ ఫారాలపై ప్రయాణికుల బ్యాగులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా తనిఖీలు చేసినట్లు ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కాజీపేట జంక్షన్‌లో..

కాజీపేట రూరల్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని కాజీపేట జంక్షన్‌లో గురువారం రాత్రి సివిల్ పోలీసులు, రైల్వే పోలీసులు సంయుక్తంగా ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. కాజీపేట సివిల్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ రెడ్డి, కాజీపేట ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ చటర్జీ, ఎస్సై లవన్‌కుమార్, ఆర్పీఎఫ్ డాగ్ స్క్వాడ్, సిబ్బంది తనిఖీలు చేస్తూ అనుమానాస్పద వ్యక్తుల వివరాలు తెలుసుకున్నారు.

విద్యార్థినికి వాసవి క్లబ్ ఆర్థిక సాయం



చెక్కు అందజేస్తున్న ప్రతినిధులు

రామన్నపేట: వాసవి క్లబ్ వరంగల్ ఆధ్వర్యంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సౌజన్యంతో ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన 9వ తరగతి చదువుతున్న కొదుమూరి లక్ష్మి యశస్వినికి సరస్వతి పథకం ద్వారా రూ.5 వేల విలువైన చెక్కును వరంగల్ వాసవి క్లబ్ అధ్యక్షుడు తోనుపునూరి వీరన్న అందజేశారు. పేద ఆర్యవైశ్య విద్యార్థిని చదువు నిమిత్తం నగదు అందజేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మల్యాల వీర మల్లయ్య, డిస్ట్రిక్ట్ ఇన్‌చార్జ్ శ్రీరామ్ శైలజ, కోశాధికారి ఉప్పల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

డీఈఓ జ్ఞానేశ్వర్ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనంలో బాధ్యులు

విద్యారణ్యపురి: ఎంఈఓలతో నిర్వహిస్తున్న జూమ్ మీటింగ్‌లో ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ సుజన్‌తేజపై వరంగల్ డీఈఓ జ్ఞానేశ్వర్ దుర్భాషలాడారని తెలంగాణ స్టూడెంట్స్ ఫెడరేషన్ నాయకులు తెలిపారు. ఈ మేరకు డీఈఓ వైఖరిని నిరసిస్తూ వరంగల్ కలెక్టరేట్ ఎదుట గురువారం నిరసన తెలిపి డీఈఓ జ్ఞానేశ్వర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కన్నం సునీల్ మాట్లాడుతూ డీఈఓపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు రామంచ శ్రీను, బాధ్యులు నాగారం మణితేజ, బన్ని, రోహిత్, అనిల్, రాకేష్, శ్రీకాంత్, మణికంఠ, సందీప్, వంశీ, భరత్, జగపతి పాల్గొన్నారు.

ప్రతీ పౌరుడు దేశభక్తిని చాటాలి



జెండాకు సెల్యూట్ చేస్తున్న నాయకులు

ఖిలా వరంగల్: ప్రతీ పౌరుడు దేశభక్తిని చాటాలని, భారతీయుడిగా పుట్టడం ఒక వరమని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ఆదేశాల ప్రకారం హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమంలో భాగంగా యువ మోర్చా, మహిళా మోర్చా ఆధ్వర్యంలో వరంగల్ పోచమ్మమైదానం నుంచి వరంగల్ రైల్వేస్టేషన్ వరకు 75 అడుగుల జాతీయ జెండాతో గురువారం తిరంగా యాత్ర, ర్యాలీ నిర్వహించారు.

శ్వేతార్కలో గణనాథుడికి నిత్య కల్యాణం

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో సిద్ధి, బుద్ధి సమేత గణనాథుడి ఉత్సవ విగ్రహాలను భక్తులు గురువారం ఊరేగించారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు అయినవోలు వెంకటేశ్వర్లు శర్మ ఆధ్వర్యంలో అర్చకులు నిత్య కల్యాణ వేడుకలను జరిపించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు శ్రావణ మాసోత్సవ వేడుకల్లో భాగస్వాములయ్యారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు రాధాకృష్ణ శర్మ, సాయికృష్ణ శర్మ, సదానందం, శ్రీనివాస్, రాజిరెడ్డి, సీనమ్మ, రవి పాల్గొన్నారు.

నవరాత్రుల ఉత్సవ వేదిక నిర్మాణ పూజలు

రామన్నపేట / హన్మకొండ కల్చరల్ : నగరంలోని కాశిబుగ్గలో కాశిబుగ్గ వర్తక సంఘం ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నిర్వహించే గణపతి నవరాత్రులకు ఉత్సవ వేదిక నిర్మాణ పనులను సంఘం అధ్యక్షుడు గుండేటి కృష్ణమూర్తి గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి వడిచెర్ల సదానందం, కోశాధికారి మండల శ్రీరాములు, ఉపాధ్యక్షులు బయ్య స్వామి, మాజీ కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్, బాధ్యులు రాజ్‌కుమార్, జగదీశ్వర్, చక్రపాణి, లింగయ్య, వెంకట్రామిరెడ్డి, కొమురయ్య, విద్యాసాగర్, రాజు, నారాయణ, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

హన్మకొండ చౌరస్తా: వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆలిండియా కాన్ఫడరేషన్ ఆఫ్ కమర్షియల్ ట్యాక్సెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కేఆర్ సూర్యనారాయణ అన్నారు. తెలంగాణ వాణిజ్య పన్నుల శాఖ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మొహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ ఆధ్వర్యంలో సూర్యనారాయణను ఉద్యోగులు గురువారం కలిశారు. ఈ సందర్భంగా పదోన్నతుల కోసం డీపీసీని వెంటనే పెట్టాలని, సీనియర్ అసిస్టెంట్లకు బదిలీలు చేపట్టడంతో పాటు శాఖలో జాయింట్ కమిషనర్ పరిధిలోని ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో శాఖ రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ రజ్వీ, వాణిజ్య పన్నుల శాఖ రాష్ట్ర కమిషనర్ హరిత, భిక్షపతి, విక్టర్‌పాల్, జగన్మోహన్‌రెడ్డి, మూర్తి, ముజీబ్, హుస్సేన్, గోపి కిశోర్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

త్రివర్ణ రంగులతో తినుబండారాల తయారీ భేష్

రామన్నపేట: త్రివర్ణ రంగులతో కూడిన తినుబండారాలు తయారీ చేయడం భేష్ అని నగర మేయర్ గుండు సుధారాణి ప్రశంసించారు. హర్ ఘర్ తిరంగా – హర్ ఘర్ స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా జీడబ్ల్యూఎంసీ, ఐటీసీ వావ్ – ఈ శ్రీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బల్దియా ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మేయర్ పాల్గొని డీఆర్‌సీసీ సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో సీఎంహెచ్‌ఓ డాక్టర్ రాజారెడ్డి, ఎంఎస్‌ఓ కోఆర్డినేటర్ గౌతమి, వావ్ ఫీల్డ్ కోఆర్డినేటర్లు పవన్, సౌజన్య పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రి వైద్యుడిపై ఫిర్యాదు

ఎంజీఎం : హనుమకొండలోని సంకీర్తన ఆస్పత్రి వైద్యుడిపై వరంగల్ జిల్లా పరిధిలోని చెన్నారావుపేట మండలంలోని 16 చింతల్‌తండా మాజీ సర్పంచ్ బానోత్ గణేశ్‌నాయక్ హనుమకొండ జిల్లా వైద్యాధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ అల్లెం అప్పయ్యకు గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గణేశ్ మాట్లాడుతూ తనపై తండాకు చెందిన కొందరు దాడి చేయగా తాను తీవ్ర గాయాలపాలై సంకీర్తన ఆస్పత్రిలో వైద్యం చేయించుకున్నట్లు తెలిపారు. తొలుత తనకు తీవ్ర గాయాలైనట్లు ఆస్పత్రి వైద్యుడు జాటోతు రవికుమార్ గుర్తింపు చికిత్స చేశాడని, తదనంతరం ఎంఎల్‌సీ కేసు నేపథ్యంలో తనపై దాడి చేసిన వారితో కుమ్మక్కై రిపోర్టు మార్చాడని ఆరోపించారు. వైద్యుడి తీరుపై సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని కోరాడు. ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సమ్మయ్య రాథోడ్, ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు మంద కుమార్, ఎంఆర్‌పీఎస్ జాతీయ నాయకుడు పుట్ట రవి, రాష్ట్ర అధికార ప్రతినిధి లకావత్ కరుణాకర్, పీపుల్స్ డెమోక్రటిక్ మూమెంట్ జాతీయ కన్వీనర్ పోరిక ఉదయ్ సింగ్ పాల్గొన్నారు.

మడికొండలో ఫిల్లింగ్ స్టేషన్‌కు భూమిపూజ

మడికొండ: మడికొండలోని సిటీ పోలీస్ ట్రైనింగ్ సెంటర్ ఆవరణలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఫిల్లింగ్ స్టేషన్‌కు వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్ గురువారం భూమిపూజ నిర్వహించారు. అదనపు డీసీపీ సురేష్‌కుమార్, ఏసీపీలు అనంతయ్య, రమణబాబు, ఇన్‌స్పెక్టర్లు కిషన్, రవికుమార్, మంగీలాల్ పాల్గొన్నారు.